వయస్సు పెరిగేకొద్దీ శరీరాలూ, తద్వారా బ్రతుకులూ అలసిపోవడం సహజమే. అయితే, ఆ బ్రతుకులకు ఆగతం లేకపోవచ్చు కానీ గతం వుంది. ఆ జ్ఞాపకాలు మనస్సుకు ఉత్తేజం యిస్తున్నంతకాలమూ ఏ వయస్సులోవున్నా అవి 'అలసిపోని బతుకులే!'




"అయ్యో....అయ్యో....కోల్లు సూడురో...యాటి నోర్లు వడిపోనూ...యాటి దౌడలు దగ్గెర బడ ఒడ్లన్ని బుక్కుతున్నాయి..ఉశ్కో..ఉశ్కో...."

కోడలుదాని గొంతిని. గటుదిక్కు సూసిండు మల్లిగాడు. నిజంగనే ఆకిట్ల ఎండబోసిన ఒడ్లను యిష్టమొచ్చినట్టు. కడుపునిండ బుక్కుతున్నయి కోల్లు.

"గాడ ఏం సేత్తన్నవు ముసలోడ? కోల్లు ఒడ్లన్ని పాడుసేత్తంటె కూకోని నిద్రబోతన్నవ?" మామ దిక్కు మర్లి ఒర్లింది సంద్రి.

"ఉశ్కో . ఉశ్కో. . నీ తల్లి.. ఉశ్కో" బలిమీటికి అనుకుంట పక్కకున్న కట్టెను యిసిరేసింది ఎనభయ్యేండ్ల మల్లిగాడు.

గజం దూరమన్నపోలేదు.రెండు గజాల కట్టె.

"ధూత్.. నీ యవ్వ.. ధూత్..ధూత్.." యింకేమిసిరెయ్యాల్నో తెల్వక రెండు సేతులను గాలిలకు ఎగిరేసిండు.

పక్కనే కూకున్న లచ్చి కీసుమని

లొల్లి పెట్టింది. తను కూడా కోళ్లను ఎల్లి కొడ్దామని రెండు సేతులను గాలిలకు ఎగి రేద్దామనుకుంది. కాని ఒక సెయ్యే లేసింది పక్షవాతమొచ్చి ఇంకోటి లెయ్యలేదు. తిడ్ద మనుకుంది. కాని పక్షవాతమొచ్చి నోరు కూడా పడిపోయింది. పదేండ్ల కిందనే. తనకా రోగమొచ్చినందుకు దాని దిక్కేలి మొగనికి సాయం సెయ్యరానందుకు తొలుత పారి తనను తానే తిట్టుకుంది దెబ్బయ్యేండ్ల లచ్చి. ఎటు తోసక సేతులు ఎగిరేసుకుంట లొల్లి పెడ్తున్న మొగని దిక్కు పాపమనుకుంట సూసింది. ఎగురు తున్న సేతులదిక్కు ఇంక పాపమనిపిచ్చె దట్టు సూసింది.

అల్సిపోయినటుండు. సేతులను కిందికి యాల్లాడేసి పెండ్లం దిక్కు సూసిండు మల్లిగాడు. పచ్చకూర కాడల్లెక్క ఊగు లాడ్తున్న రెటలను సూసుకుంట కూకుంది లచ్చి. ఏందో అందాపుసుకున్నట్టుంది. పెద్వాలు కదిలినయి. సప్పుడుమాతరం రాలేదు. గది సూసిన మల్లిగాడు 'అయ్యో' అనుకుండు. పెండ్లం కండ్ల దిక్కు సూసిండు. అవ్వి మల్లిగాని సేతులనే సూస్తున్నయి

"ఎట్వాంటోడు ఎట్లయిపోయిండు !" లచ్చి సూపులు పచ్చి, పచ్చిగ గులిగినయి.

ఆ గుణుసుడుయినిపిచ్చిందేమో మల్లి! తన దిక్కు తనే సూసుకుండు. "నిజంగ ఎట్లుంటి ? ఎట్లయిపోయిన !" గట్ల మను సులకు రాంగనే యాభయి యేండ్ల కింది ఇషయం గ్నాపకమొచ్చింది. దాంతోని పెద్వాల మీనికి నగొచ్చింది.

*            *            *

"లాభం రెండు.... మూడు...." కొల్సు కుంట బస్తలల్ల ఒడ్లు నింపుతుండు పోషి గాడు.

కల్లమంత సందడిగుంది. ఒడ్లు రాసులు రాలుగా పోసున్నయి. ఆటిని గరిసెలల్లకు తెస్కపోనీకె పది బండ్లు ఒరుసపొంటి, తయ్యారుగ నిలుసున్నయి. రాములుగాడు ఒడ్లు బార్వారబడ్తుండె. ఆని పెండ్లం ఎంకి చాటలోని ఒడ్లు అందిత్తుంది. పేరి గాడు నారతాళ్లు పేనుతుండె. పోషిగాని పెండ్లం సుక్క సంచులు కుడ్తుంది.

గవన్ని సూసుకుంట, యాపశెట్టు కింద మంచంమీన కూకోని సుట్ట తాగుతుండు బుచ్చిరెడ్డి దొర. రత్నమ్మ దొర్సానేమో, నడుమీన్మద సేతులు పెటోకొని కల్లంల తిరుగుతున్నది.

"అరేయ్ ! మల్లిగా ! ఒక్కనివే లేవద్ద వేందిర ? ఆ నర్సిమ్మన్ని పిల్వరాదు !" సుక్క కుట్టిన సంచిమీనికి ఒంగుతున్న


## అరబ్ దేశాలలో ఉద్యోగం

ఖచ్చితమైన పద్ధతి, ప్రభుత్వ నిబంధనలు మరియు ఖాళీలు తెలుసుకునే విధానం మీకు తెలిసినట్లయితే గల్ఫ్ దేశాలలో నేరుగా ఉద్యోగంను మీరు పొందవచ్చు. స్త్రీలు / పురుషులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ మరియు అన్‌స్కిల్డ్ పనివార్లగా నెలకు మూడునుండి పన్నెండు వేల రూపాయలవరకు జీతంపై ఉద్యోగావకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల చాలామంది నేరుగా ఉద్యోగాలు పొందారు. పూర్తి సమాచారం మరియు 800 విదేశీసంస్థల యొక్క చిరునామాలు మరియు 100 మంది రిక్రూటింగ్ ఏజెంట్ల చిరునామాలు గల గ్రంథం కొరకు ఇంగ్లీషు/హిందీలో మాత్రమే స్వంత చిరునామాగల కవరుతో మాకు వ్రాయండి.

GLOBE SERVICE INFORMATION CENTRE (REGD) (411/13)
WZ. H/24, New Mahabir Nagar. NEW DELHI-110 018.






# కేశవర్ధినిని

మీరు తలకు రాసుకొనే నూనెలో కలిపి ఉపయోగిస్తే అధికంగా మంచి గుణాన్ని పొందుతారు. మీ తల వెంట్రుకలు ఒత్తుగా రోజు రోజుకీ పొడుగ్గా పెరుగుతాయి.

దక్షిణ భారతదేశపు సాంప్రదాయిక కేశ సౌందర్య రహస్యమే కేశవర్ధిని. మీరు వాడుకొనే తలనూనెలో కేశవర్ధినిని కలిపి ప్రతీ రోజూ తలకురాసి తల చర్మానికి అంటేటట్లు చేయండి. మీ తల వెంట్రుకలు ఊడి పోకుండా జేసి ఆరోగ్యవంతంగా అందంగా పెరిగించడానికి ఇదేమంచి మార్గము ఇప్పుడే కేశవర్ధినిని ఉపయోగించడం మొదలు పెట్టండి. కేశవర్ధిని సాధారణ తల నూనెకాదు. దీన్ని కొబ్బరినూనె లోనే లేక మీరు వాడే ఇతర తల నూనెలోనో కలిపి వాడాలి.

కేశవర్ధిని (ప్రోడక్ట్స్), ఆర్కాటు రోడ్డు, మద్రాసు-600 087

OBM 383/ZTG


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
— శస్త్రచికిత్స
అవసరములేదు!

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం. అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి. శుక్లనష్టము. నపుంసకత్వము. హెర్నియా. చర్మవ్యాధులు. పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్‌రోడ్, మద్రాసు-17

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :
Samaj Kalyan (R.L. 78)
(P. o) Katri Sarai (Gaya)

## బాల గోపాలం



చంచాతో తింటున్నా!

ఫొటో : యమ్. శివశంకరయ్య.
శ్రీశైలం ప్రాజెక్టు

మల్లిగాన్తోని అన్నడు బుచ్చిరెడ్డి దొర.

సంచిని అందుకునెటందుకు తయ్యారుగ నిలబడ్డడు నర్సిమ్మ బండిమీన.

దొర మాటలు యినబడ్డయో లేదో బస్తను ఎత్తబోయిండు మల్లిగాడు.

"ఓర్నియవ్వ! దొంగకొడక! ఒక్కనివే లేబట్టవేంది? అదేందనుకుంటున్నవు? నూట పది సేర్ల ఒడ్లబస్త! మీదేసుకోని సస్తవు. ఓరి నర్సిమ్మ! దిగి ఓ సెయ్యెయ్యెహె!!" సుట్టను తీసుకుంట అన్నడు దొర.

బండిమీనికెలి దుంకిండు నర్సిమ్మ దొర మాటలు యినంగనె.

ఒడ్లబస్తకాడ ఒంగబడ్డ మల్లిగాడు సక్కగయిండు. తన దిక్కు తనే సూసుకుండు. సెయ్యెత్తు మడిసి. కర్రెగ తుమ్మ మొద్దు లెక్క వుండు. ఎక్కడ సూసిన రాల్ల లెక్క బలిసున్నయి కండలు.

"తనకు లేవదా గిది?" కోపమొచ్చింది.

"నన్ను తక్వ అనుకుంటుండ్రు దొర" కండ్లు ఎర్రగయితుంటె గుర్రుతుండు.

"ఓర్నితల్లి! ఏందిరో! పెయ్యి పెంచంగనే అయిపాయెనా? ఏందనుకున్నవది? నూటపది పేర్ల ఒడ్లసంచి! ఒక్కనివే లేవత్తవ? గాన్నుంచి నాల్గు గజాల దూరం ఎత్కొచ్చి బండ్లేస్తవ? ఏందిరో నీ కత! కడుపు నొప్పి లేపి సస్తవాసి!" మంచంల కెలి లేసుకుంట అన్నడు దొర.

ఒడ్లు కొలుస్తున్న పోషిగాడు, తూర్పాల పడ్తున్న రామిగాడు, తాల్లు పేనుతున్న పేరిగాడు. నర్సిమ్మ అందరు పనులు యిడిసిపెట్టి మల్లిగాన్నె సూసుకుంట నిలబడ్డ్రు.

"నన్ను తక్వ లెక్కబెడ్తుండ్రు దొర!" అన్నుంచి కదలకుంట, రోసంతోని మల్లి అన్నడు మల్లిగాడు.

గా మాటలినంగనె బాయిల గుండు వడ్డట్టు భల్లున నగిండు దొర. "నీ యవ్వ! గాడ్దికొడక! నీకు నివ్వు యేమనుకుంటున్నవు? బీమునివనుకుంటున్నవ? ఒక్కనివె లేబట్టి బండ్లేస్తవా? ఎయ్యిర! సూస్త! ఏస్తివ. నీ యవ్వ. గియ్యాల్నె కుండెడు కల్లు పోయించి, మ్యాకపోతునిస్త! ఎయ్యి సూద్దారి." మీసాలు దువ్వుకుంట శెర్తు కట్టిండు.

కల్లంలో అందరు నగిండ్రు, కల్లి మూడుత్తున్న లచ్చి మాతరం నగలేదు. మీదకెలి నగుతున్న అల్లందర్ని తినెదట్టు. బూడ్దిసేసెదట్టు సూసింది. అయినంక. మల్లిగాన్ని సూసింది. "ఏంది! గినె ఎప్పుడు గిట్ల సేత్తడు? ఒడ్లబత్తంటె ఏందనుకుంటుండు? కడుపు నొప్పి లెయ్యద?" గుట్ట లెక్క నిలుసున్న మొగున్ని సూసుకుంట బాదగ అనుకుంది. ఆనికి ఏంకాకుంట సూడమని పోసమ్మను మొక్కుకుంది.

కండ్ల కొనలల్ల కెలి పెండ్లన్ని సూసిండు మల్లిగాడు. తన దిక్కే సూత్తున్నది. యింకొంచెంసేపు గట్లనె సూత్తె. ఆ కండ్లురుకొచ్చి అతుక్కపోతయేమోనని పిచ్చింది. సూపు తిప్పుకుండు. ముంగలున్న సంచిని సూసిండు.

నీల్లాడనీకె తయ్యారుగున్న ఆడదాని లెక్క నిండ పగిలిపోయేదట్టుంది. తల కాయెత్తి బండి దిక్కు సూసిండు. పది మూరల దూరం వుంది.

మెల్లగా ఒంగిండు. చాతి నిండ గాలి తీసుకుండు. సంచి మూతికాడ ఒక సెయ్యి ముడ్డికాడ ఒక సెయ్యేసి ఒకూపుతోని లేపిండు. అల్కగనె లేసింది. ఎవరిదిక్కు సూడలేదు. బండిదిక్కు నడ్వలేదు. నిలబడ్డ కాడ్నుంచే బలమంత పెట్టి యిసిరేసిండు. బస్తెల్లి దబ్బుమనుకుంట బండ్లె పడ్డది. ఆ అదురుకు, బండి యిరిగిందేమోననిపిచ్చింది.

తీసుకున్న గాలిని గప్పుడు యిడిసిపెట్టిండు. సుట్టు ముట్లోలెవ్వరు జపగలేదు. సీమ సిటుకుమంటె ఇనబడెదట్టుంది. ఎవరు మాట్లాడలేదు.

కండ్లు కాష్ఠమోలె ఎలుగుతుంటె. గప్పుడు దొర దిక్కు సూసిండు మల్లిగాడు మల్లిగాన్నే సూసుకుంట నిలబడ్డ దొర. ఇంకొక్క నిమిసందాంక గట్లనె సూసిండు రాయోలె. అయినంక జర్ర కదిలిండు. ఇంక కొంచెం సేపయినంక జర్ర నగిండు గట్లనె నగుతాబోయిండు ఆఖిరికి మొగులు ఒనికెదట్టు నగిండు. దొరనుసూసి అందరు నగిండ్రు.

అప్పటిదాంక కండ్లు మూస్కోని పోసమ్మను మొక్కుతున్న లచ్చి. గా నగులసప్పుడుకు పులికిపడి కండ్లు తెరిసింది. బూదేయి పగులుతున్న దేమోననుకున్నది. అందరు నగాపి సల్లబడ్డంక తను నగింది. గట్లనె కండ్లల్లకేలి నీల్లొచ్చిందాంక నగింది. గప్పుడు సూసిండు మల్లిగాడు. పిచ్చిదానోలె వూగుకుంట నగుతున్న పెండ్లన్ని సూసి తొలుత పారి చాతి పగిలె దట్టు నగిండు.

ఒక్కటన్నడు గాని. నాల్గు మ్యాక పోతులనిచ్చి నాల్గు కుండల కల్లు పోయించిండు దొర. గూడెం. గూడెమంత మస్తుగ తిని తాగిండ్రు.

గయ్యాల మాపటీల గుడిసెల దీపం తక్వచేసి పెండ్లన్ని కావలిచ్చుకుండు మల్లిగాడు.

"అబ్బ.... ఒడ్ల సంచిననుకొన్నవఏంది ఆడదాన్ని! నడుంబొక్కలు యిరగ్గొడ్తవ? జర మెల్లెగ...." గులుక్కుంట యింక దగ్గెరికి జరిగింది లచ్చి.

నెత్తివి ఎనకకు యిసిరేసి గొల్లున నగిండు మల్లిగాడు గప్పుడు. గా నగుకు గుడిసెమీని తాటాకులు సరసరమని కదిలినయి. గాయల్ల మల్లిగాని నగుకు మొగులు మీని సుక్కలు ఊసిపోయి గుడిసెమీన రాలినయి.

* * *

"ఏందయ్యో.... ముసలాయన. ముసలామెను తీస్కోని రా! బువ్వ తినరాయేంది? దీపాలు పెట్టే ఆల్లయింది!" సంద్రి యింట్లకేలి అరిసింది.

ఆల్లిద్దరికి గా గొంతినబడలేదు.

ఇంక ఆలోశన్లలోనె ఉన్న మల్లిగాడు తన దిక్కు తనే మల్ల సూసుకుండు. "నిజంగనె! ఎట్లాసుంటోన్ని ఎట్లయిపోయిన? గప్పటి కండలు యాడికి పోయినయో? ఒట్టితోలు. బొక్కలే మిగిలినయి అవును మల్ల! గిప్పుడు ముసలోడయిండు. ఎనబయేండ్ల ముసలోడు. యాడుంటది బలం!" అనుకుంట పెండ్లం దిక్కు సూసిండు.

దానికి కండ్లు కనిపిత్తున్నయో లేదో గాని, మొగని దిక్కె సూత్తుంది.

"ఎట్లయిపోయింది లచ్చి? గాయల్ల కల్లంల ఎట్లుండె మామిడి పండోలె మెరుసుకుంట? గాకాలంల దొర్సాని దగ్గెర నేర్సుకోని జెడేసుకునేడిది. పిర్రల కిందిదాంక యాల్లాడబడె జెడల ముద్ద బంతి పువ్వులు ముడుసుకోని. ఒంగి కల్ల మూడుత్తుంటె దొర కూడ సూపు జర్పుకబోతుండె! గట్లాసొంటిది గిప్పుడెట్లయింది? నెత్తి మీన నాలు ఎంటికపోసలన్న లేవు. పెయ్యంత సీకిపోయిన బట్టోలె ముడుసుకపొయ్యింది. కొత్త కొత్త మిసిన్లు కనిపెట్టున్నరని సెపరు. మల్ల దీని పెయ్యి మీని ముడ్తలు సాపుసేసె మిసెను తయ్యారు సేసింరో?

గా ఆలోశన రాంగనె నగొచ్చింది. తనో పిచ్చోడు! దేవుడు చేసిన ముడ్తలను మడిసెక్కడన్న సాపు సేత్తడా?

మొగన్ని సూత్తన్న లచ్చి కండ్లల్ల కూడ గవె ఆలోశన్లు,

యాబయ్యేండ్ల కింద మల్లిగాడెట్లుండె? నల్లరాయోలె గట్టిగ, యింతెలుము చాతితోని యెట్లుండె! గప్పుడు రజాకర్లప్పుడు దొరమీనికొచ్చిన పదిమందిని ఒక్కడె అదరగొట్టి తరిమేసిండు. ఎన్నడు లేంది గాయల్ల మల్లిగాన్ని కావలిచ్చుకుండు దొర. తమిద్దర్ని యింటికి పిల్చి కోడికూరతోటి బువ్వపెట్టింది దొర్సాని. ఒచ్చెదప్పుడు కొత్తబట్టలిచ్చి నూర్రూపాలు సేతుల బెట్టింరు. దరమరాజులు! సచ్చియాడున్నరో!

పెండ్లయినంక ఎన్నో యేండ్లకు గప్పుడె కడుపయ్యింది తనకు. అసలు పిల్లలే పుట్టరనుకుండ్రు. ఎంత ఖుషయ్యిందో పిచ్చి మల్లిగాడు గాయల్ల? గుడిసెలోపలనే తననెత్తుకోని గిర్రున తిప్పిండు. ఎంత ముద్దుగ సూసుకునేటోడో!

గప్పటి యాదితోటి లచ్చి కండ్లనీల్ల కొనలమీన మల్ల నగుపుట్టింది.

* * *

"ఏందిదో! గీ ముసలోల్లు కూడు కుదిచ్చోనీకె రారా యేంది? యాల్లతోటి సావొచ్చిందిర దేవుడ! యింకెన్నేండ్లు


భారతదేశములో ప్రఖ్యాతిగాంచిన

6 సంవత్సరముల గ్యారంటి ఉండే మెరి 22Ct సూపర్ స్పెషల్ బంగారు కవరింగు ఆభరణములను, 16 సం॥ల నుండి ఆల్ ఇండియా మొట్ట మొదటి వారిగా తయారుచేసి. భారతదేశము మొత్తము వి. పి. పి. ద్వారా పంపించే పెద్ద స్థాపనము దీనికి కావలసిన వివరములను ఈ దిగువ అడ్రసుకు ఉత్తరము వ్రాసిన కేటలాగు ఉచితముగా పంపబడును.




కేటలాగులో ఉండే నంబరును, ధరను స్పష్టముగా, ఉత్తరము ద్వారా వ్రాసిన, వి.పి.పి. ద్వారా పంపబడును. మీ అడ్రసును స్పష్టముగా వ్రాయకపోతే, ఆంగ్లములో వ్రాయవలయును వి.పి.పి. దారి తప్పిపోవుట అగును. ఏజంట్లు కావలయును: ఏజంట్లకు ప్రత్యేక పద్ధతులు కలవు. వివరములకు ఈ క్రింది అడ్రసుకు వ్రాయవలయును. అడ్రసు తప్పనిసరిగా ఆంగ్లములో వ్రాయవలయును.

ESTD 1963

"MERI GOLD COVERING WORKS."
No 14, RANGANATHAN STREET,
Post-Box No 1405, T. NAGAR, MADRAS-600 017

బతుకుతరో ఏందో కాకుల్లెక్క ! తాసి లోల్లు! సావనన్న సావరు!"

పంద్రి ఎంత పెద్దగ మాట్లాడుతున్న గూడ ముసలోల్లిద్దరిట్ల యెవరికి యినబడ లేదు.

లచ్చి సూపంత మల్లిగాని మీనే వుంది. ఒయిసు పెరుగుతున్నకొద్ది సరీరంతో పాటు లచ్చి గుండెలు కూడ కరిగిపోయి నయి. గుండెల్లోని పానం కూడ. గిన్నేండ్ల గ్నాపకాలను తీస్కోని కండ్లల్లకు సేరుకున్నయి. గిప్పుడు దానికి సరీరంలేదు. సరీరంల ఏ బాగం బతికిలేదు. ఉన్నయల్ల రెండు కండ్లె. ఆ కండ్లల్ల కేలి ఎప్పుడెగిరి పోవాల్నా అని ఉరుకులాడుతున్న పానం. గంతె! రోగమొచ్చిం దగ్గర్నుంచి లచ్చి నోరుతోటి మాట్లాడదు. చెవులతోటి యినదు. కండ్లతోనె యింటది: కండ్లతోనె మాట్లాడ్తది!

"పిచ్చోడు! సగమొయిసు ఒచ్చినంక పుట్టిన కొడుకును ఎట్ల పెంచుదమను కుండో!"

"మనకేందె? దొరిచ్చిన అయిదెకరాల బూమితోటి రాజు లెక్క పెంచుదారి!" ముద్దిచ్చుకుంట మురిపెంగ అనెటోడు. గా ఆసకు యిత్తనమేసినటు కొడుకుకు 'రాజయ్య' అని పేరు పెట్టుకుంద్రు.

ఒయిసులున్నప్పుడు యెంత సిలిపోడుండె మల్లిగాడు! పాలన్ని పోరనికె యిత్తున్నవని మాపటేల్లప్పుడు అలిగెటోడు. ఒక రొమ్ము నంటోనికి, ఇంకోటి తనకు పంచియ్యమని కొట్లాడెటోడు. గా సంగతి గురుతుకు రాంగనె యెండిపోయిన బొక్కలు జల్లుమన్నయి. శాన కాలం తరవాత, నిండుగ, పచ్చి పచ్చిగ, మెత్తగ నగినయి లచ్చి కండ్లు.

ఏమరతమయిందో యేమో మల్లి! పెండ్లన్నె సూత్తున్న మల్లిగాడు కూడ గడ్డిలెక్క పెరిగిన మీసాల కిందికేలి, పొదలెక్క పెరిగిన తెల్లగడ్డం మీదికేలి యెల్లబోతున్న బాయోలె నగిండు.

రాజోలె పెంచుదమనుకున్న కొడుకయితె రాజు లెక్కనె పెరిగిండు. కాని. తము మాతరం జల్ది జల్ది ముసలోల్లయి పోయింద్రు, ఒయిసు పెండ్లం ఒచ్చినంక "అయ్యమ్మలు శాన ముసలోల్లయి పోయింద్రు. యింకెప్పుడు సత్తరో?" అనుకుండు రాజయ్య. గంతెమల్లి! పండు మక్కినంక ఎక్వరోజులుంటె మురిగి పోయి. పురుగులు పడయి? మనం గూడ గంతె! కాని, సావు మన సేతుల యాడుంది పుట్టిచ్చినోడు ఆడు తీస్కపోవాలెగాని! గా ఆలోశన కండ్లల్ల నిండిపోయి బరువయినట్లున్నది. కండ్లు నలుసుకుంది లచ్చి.

"ఏందయ్యో! గది గప్పటినుంచి నెత్తి నలగొట్కుంటుంటె యినబడ్త లేద? లెగండి! లెగి ఒంతు తీరుస్కొండి! యింకెంతసేపు మేల్కనుండాలె మీ కోసరం? ఏం సేత్తం? సచ్చెదాంక యేగాలె గద! లెగండి?" తాసుపామోలె సర్రుమండు రాజయ్య.

రాజును చేసిన కొడుకును కండ్లు లేపి సూసింది కన్నతల్లి. కండ్లతోనె ఏందేందో అడిగింది. యింకేదొ సెప్పింది.

కండ్లబాస-తెల్సుకునేటందుకు, రాజయ్య ఆల్లలెక్క ముసలోడ? గందుకె యినలేదు యింక కసురుకుంట ఎల్లిపోయిండు.

సంకలకింద సెయ్యేసి లేపుతున్న మొగన్ని పట్కొని మెల్లగ లేసింది లచ్చి.

మాపటీల బువ్వ తిన్నంక, గొంగడి బొంతేసుకోని ఆకిట్ల వొరిగింద్రు ముసలోల్లు.

మొగులు మీన సందమామ, గటు,గిటు గంతులేత్తుండు. ఎన్నెలపాట పాడుకుంట. కింద పండుకున్న బూదేయిని సల్లగ. మత్తుగ జోకొడ్తుండు. ఇంకెప్పుడొత్తరు.. యింకెప్పుడొత్తరు అని కండ్లు కొట్టుకుంట పిలుత్తున్న సుక్కలను సూసుకుంట మెలెంకల పండుకుండు మల్లిగాడు. సగం రాతిరయ్యింది. కాని రెప్పలు మాతరం అతుక్కుంటలేవు. ఏదో ఆలోశిత్తుండు. గా ఆలోశన రేపటి కోసరమైతె కాదు. యెందుకంటె రేపు అనేది ఉన్నదో, లేదో తెల్వదు. అందుకని. యెనక్కుపోయిన బతుకును గ్నాపకం సేసుకుంట పండుకుండు.

"ఆ(....ఆ( .. ఊ...." ఒక్కపారే మూల్గింది లచ్చి.

"యేందె.... యేందె.... లచ్చి...." పక్కకుమల్లి పెండ్లన్ని అడిగిండు.

రోగమొచ్చిన సెయ్యిమీన జెల్లపురుగు పారుతున్నది. గులగుల పెడ్తున్నదేమో! యెల్లగొడ్దమంటె సెయ్యి కదుల లేదు. యింకో సెయ్యేమో లేత్తలేదు. గందుకే పురుగును సూసుకుంట కీసుమంది లచ్చి.

సెయ్యిమీన నడుత్తున్న పురుగును. పురుగునే రెప్పకొట్టకుంట సూత్తున్న కండ్లను మార్చి మార్చి సూసిండు మల్లిగాడు. బాదతోటి లచ్చి కండ్లు ఒంకరపోతున్నయి. మల్లిగాని పేగులు తెగిపోయినయి, శానకాలమయినంక యేడుపొచ్చింది. గా ఏడుపు చాతిల నిండిపోయి. చాతి బొక్కలు పగిలిపోతాయేమోననిపిచ్చింది.

సిన్న పురుగును కూడా ఎల్లగొట్ట శాతకాని పెండ్లన్ని సూత్తుంటె కండ్లు తూట్లు పడ్తయేమోననిపిచ్చింది.

పురుగును పక్కకు యిసిరేసి లచ్చిని దగ్గెరికి జరుపుకుండు. నెత్తిని మెల్లెగ లేపి చాతిమీన పెట్టుకుండు. గప్పుడు యేడిసిండు ఎంటికెలు లేని నెత్తిని. నిమురుకుంట.

"గిది సూసెదానికె నేనింక బతికున్నానె? నన్నెందుకె దేవుడింక బతికిత్తుండు? యింకేం సూడమంటడొ? గయన్ని సూడకముందె తీస్కపోతె బాగుండె!"

గా మాటలిన్నంక లచ్చి గుండెలు పగిలిపోయినయి. కండ్లల్ల గుంటలు పడెదాంక యేడిసింది, ఏడుసుకుంటనె మొగని నోరు మూసింది.

నోరు మూత్తున్న అరిపేయిని గట్టిగ పట్కొని పానం లేని నగు నగిండు మల్లిగాడు.

"యేందె ఎర్రిదానా! గిన్నేండ్లు బతికినం. పెపంచకమంత సూసినం! యింకెందుకె సావంటె బయపడ్తున్నవు? మన ముండి మాతరం సేసేదేంది? యెంత జల్దిపోతే గంత మంచిది! అవునె పిచ్చిదాన! మనం సచ్చి. మల్ల పుడ్దారి! గా సందమామకూడ వదిగేను రోజులకోపారి సచ్చి. పుట్టుకుంట యెప్పుడు సూసినా ఎన్నెలతోటి బతకడ? గట్లనె. మనం. కూడ సచ్చి పుడ్దారి! మల్ల కొత్తగ,

B. A., B. Com.,

పాస్ గ్యారంటీ

ఫెయిలయిన "ఫీజు" వాపసు చేయబడును. మీరు ఇంతకు పూర్వము ఏమి చదవక పోయిననూ B.A., B.Com., ఆంధ్రా యూనివర్శిటీ చదవ వచ్చును

1978, 1979

మా పరీక్షా ఫలితాలు 100%

వివరములకు రు. 3/- M.O. చేయండి.

పోస్టలు/ఓరలు కోచింగ్ కలదు.

విజయా ట్యుటోరియల్ కాలేజి,

గూడూరు, నెల్లూరు జిల్లా.

వల్లగ బతుకుదారి!" సప్పుడు కాకుంట, నగుకుంటనె అన్నడు.

"సూసేది సేసేది లేకుంటె మాతర మేందయ్యా! గిప్పటికి యెన్ని సూసినము! యెన్ని సేసినము! రేపు లేకుంటేంది? మనెనకాల దెబ్బయేండ్ల బతుకు పానం తోటి లేద? గదాన్ని గ్నాపకం సేసుకుంట నువ్వు. నేను రేపేంది, ఎల్లుందేంది. యింకో నూరేండ్లు బతుకుదారి! పెపంచక మంత కాలిపోయినంక కూడ మనం మాతరం అల్సిపోని మన గ్నాపకాలతోనె యింక.. యింకా.. ఎప్పటికె బతుకుదారి! మనం సావొద్దయ్యా.. సావొద్దు.." అచ్చి కండ్లు బిగ్గెరగ అరిసినయి. మొగులు మీని దేవుని కినబుడెదట్లు. ★

దీని తెలుపుచేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి:

# సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే తెలుపు







ప్రతిసారీ క్రమం తప్పకుండా సూపర్ రిన్ వాడి మీ బట్టలు మరింత తెల్లగా ఎలా అవుతాయో చూడండి. మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే ఎంతో తెల్లగా ఉతుకుతుంది సూపర్ రిన్. ఎందుకంటే, సూపర్ రిన్‌లో ఉంది ఉత్తమమైన తెలుపుచేసే శక్తి. దీని తెలుపు చేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి.




## మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే మరింత తెలుపు చేసే శక్తి

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పాదన.

లింటాస్-RIN. 34-203 TL (RB)